నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 26 జూలై 2024 | KAMAREDDY

## టీయూకు రిక్త'హస్తం'

విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రులు చెప్పిన మాటలు బడ్జెట్‌లో కనిపించలేదు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి రూ.500 కోట్లు నిధులను కేటాయించారు. ఇందులో రూ.100 కోట్లను ప్రత్యేకంగా ఉస్మానియా యూనివర్సిటీకి కేటాయించగా, మరో రూ.100కోట్లను మహిళా యూనివర్సిటీ అభివృద్ధికి వెచ్చించనున్నట్లు ఆర్థిక మంత్రి చెప్పారు. మిగిలిన రూ.300 కోట్లతో మిగతా యూనివర్సిటీలకు నిధుల కేటాయింపు ఉంటుందన్నారు. ఈ లెక్కన జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీకి వచ్చే నిధులెన్ని? కేటాయింపులు అసలు ఉంటవా? ఉండవా? అన్న దానిపై స్పష్టత లేదు. ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహించే మంత్రి లేకపోవడం, కాంగ్రెస్ ఎమ్మెల్యే పెద్దగా పట్టించుకోక పోవడంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు బడ్జెట్‌లో అన్యాయం జరిగిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాలారోజులుగా రెగ్యులర్ వీసీ లేక గాడి తప్పిన తెలంగాణ యూనివర్సిటీ సహా మిగతా అన్ని వర్సిటీలకు త్వరలోనే వీసీలను నియమిస్తామని ప్రకటించడం కాస్త ఊరట కలిగించే అంశం.



టీయూలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

## అభూత కల్పన.. అబద్ధాల పుట్ట



వేల్పూర్, జూలై 25: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అభూతకల్పనగా సత్యదూరంగా, అబద్ధాల పుట్టలా ఉన్నది. ప్రజల ఆకాంక్షలను ఈ బడ్జెట్ పూర్తిగా నిరాశపరిచింది. గత ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలపై బురదజల్లే ప్రయత్నం తప్ప ప్రజా సంక్షేమం ఈ బడ్జెట్‌లో కనిపించలేదు. ఎన్నికల్లో ప్రజల ఓట్లు దండుకోవడానికి హామీలిచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 హామీలు 420 వాగ్దానాలను ఈ బడ్జెట్‌లో ఎగ్గొట్టే ప్రయత్నం చేశారు. రూ.4వేల నిరుద్యోగ భృతిపై బడ్జెట్‌లో ఊసేలేదు. 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ అని కేవలం 11వేల పోస్టులతో డీఎస్సీ అని బడ్జెట్‌లో ప్రస్తావించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటన, సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. రైతుభరోసాపై కమిటీ వేశాం, విధివిధానాలంటూ బడ్జెట్‌లో మాట చెప్పి దాటవేశారు. ఎన్నికల ముందు వరికి బోనస్ అని, ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమేనని బడ్జెట్‌లో కేటాయింపులు మాత్రం చేయలేదు. ఏకకాలంలో రూ.31వేల కోట్ల రుణమాఫీ అని చెప్పి కేవలం 11లక్షల మంది రైతులకు రూ.లక్షలోపు మాఫీ చేశారు. 25లక్షల మంది రైతులకు ఎగ్గొటారు. మిషన్ భగీరథ పథకం ఒక ఫెయిల్యూర్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేసి దానిపై మళ్లీ డబ్బులు ఖర్చు పెడుతామంటున్నారంటే ఇందులో కూడా డబ్బులు దండుకోనేందుకు ప్రయత్నిస్తున్నారు.

**- వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే**

### విద్యను ప్రైవేటు రంగానికి వదిలేసే కుట్ర



కామారెడ్డి, జూలై 25: మాటలే తప్ప చేతలు లేనట్లుగా విద్యారంగంపై రాష్ట్ర బడ్జెట్ ఉన్నది. విశ్వ విద్యాలయాలకు నిధులు కేటాయించలేదు.విద్యారంగంలో మార్పులు తెస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం ఎలాంటి నిధులూ కేటాయించలేదు. విద్యను ప్రవేటురంగానికి వదిలేసే కుట్ర జరుగుతున్నది.రూ.21వేల కోట్లకు బదులు రూ.30కోట్లు కేటాయిస్తే బాగుండేది.

**- రమణ, టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు**

### కంటితుడుపుగా ప్రస్తావన..



బోధన్: నిజాంషుగర్స్ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి చెరుకు రైతులు, కార్మికులను అయోమయానికి గురిచేసింది. ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క నిజాంషుగర్స్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు తప్పితే ఎప్పటిలోగా ప్రారంభిస్తారో చెప్పలేదు. సెప్టెంబర్‌లోపు పునరుద్ధరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ బడ్జెట్ ప్రసంగంలో గడువును చెప్పకపోవడం శోచనీయం. నిజాంషుగర్స్‌కు ఎంత బడ్జెట్ కేటాయిస్తున్నదీ చెప్పలేదు. కంటి తుడుపుగా బడ్జెట్‌లో ప్రస్తావన తప్ప పునరుద్ధరణపై చిత్తశుద్ధి లేనట్లు భావించాల్సి వస్తున్నది.

**- నాగుల రవిశంకర్‌గౌడ్, నిజాంషుగర్స్ కార్మిక నాయకుడు, బోధన్**

### విద్యార్థి, నిరుద్యోగులను మోసం చేసింది..



డిచ్‌పల్లి, జూలై 25: విద్యారంగానికి పెద్దపీట వేస్తారని విద్యార్థి లోకమంతా వెయ్యి కండ్లతో చూశాం. కానీ విద్యార్థులు, నిరుద్యోగుల ఆశలపై నీళ్లు పోసినట్లు ఈ బడ్జెట్ ఉన్నది. మా పుణ్యాన గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని మోసం చేస్తున్నది. రాష్ట్రంలో దాదాపు రూ.7వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయి. విద్యార్థికి రూ.5లక్షల విద్యా లోన్ అన్నారు. కానీ వీళ్లు ఇచ్చిన బడ్జెట్‌కు అందని ద్రాక్ష లాగే అయిపోయాయి. ఇప్పుడిప్పుడే విద్యార్థి లోకానికి అర్థమవుతున్నది ఇవన్నీ మోసపూరిత హామీలని.


**- శివ, విద్యార్థి, టీయూ**

### జేబులు నింపుకొనేలా బడ్జెట్..



వినాయక్‌నగర్, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఉపయోగపడేకి కాదు. కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులు జేబులు నింపుకోవడానికి పెట్టిన బడ్జెట్‌లా ఉన్నది. అసెంబ్లీలో తెలంగాణ ప్రజలపై మరో గాడిదగుడ్డు మోపింద్రు. పెండ్లి చేసుకునే ఆడబిడ్డలకు తులం బంగారం, రూ.లక్ష నగదు, యువతులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటర్లు అందజేస్తామని మేనిఫెస్టోలో పెట్టి.. బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. విద్యార్థుల కోసం రూ.5లక్షల విలువైన విద్యా భరోసా కార్డు గురించి ఎక్కడా చెప్పలేదు. జాబ్ క్యాలెండర్‌పై ఊసెత్తలేదు.

**- దినేశ్ కులాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు**




- రాష్ట్ర బడ్జెట్‌పై విమర్శల వెల్లువ
- గ్యారంటీలను విస్మరించిన రేవంత్ సర్కారు
- ఎన్నికల ముందు అన్ని వర్గాలపై వరాల జల్లు
- మహిళలు, యువత, నిరుద్యోగులకు భారీ ధోకా
- బడ్జెట్‌లో కేటాయింపులు చేయని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాకు ప్రయోజనం శూన్యం
- నిజాంషుగర్స్‌పై ప్రకటనకే పరిమితం..

# హామీలు గాలికి..
# అంకెలతో గారడీ

నిజామాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) ఎన్నికల ముందు ప్రజలపై వరాల జల్లు కురిపించిన కాంగ్రెస్ అధికారం చేపట్టాక దారుణంగా వంచించింది. రేవంత్ సర్కారు గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఆ విషయం మరోసారి తేటతెల్లమైంది. అనేక హామీలను తుంగలో తొక్కుతూ నిధులు కేటాయించకుండా దుర్మార్గంగా వ్యవహరించింది. మహిళలు, నిరుద్యోగులు, వృద్ధులు, దివ్యాంగులకు ఒట్టేసి మరీ ఇచ్చిన గ్యారంటీలను గాలికొదిలేసింది. ఇక, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాపై ప్రభుత్వం తీవ్ర వివక్షను ప్రదర్శించింది. అవసరమైన మేరపద్దులు కేటాయింకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజాం షుగర్స్ పునరుద్ధరణ అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించినప్పటికీ నిధులు కేటాయించక పోవడం ద్వారా ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతున్నది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటును గాలికొదిలేయడమే కాకుండా తెలంగాణ యూనివర్సిటీకి ప్రత్యేక గ్రాంట్లు ఇవ్వకపోవడం విస్మయానికి గురిచేసింది. మొత్తంగా ఎన్నికలకు ముందు హామీలు, అబద్ధాలతో ప్రజలను మురిపించిన కాంగ్రెస్.. బడ్జెట్‌లో ఆమేరకు కేటాయింపులు చేయకుండా దారుణంగా మోసగించింది.

బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా ప్రజల అభిప్రాయాలు 8వ పేజీలో..

### దగా చేసిన సర్కారు

మాట నిలబెట్టుకోవడం, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వడంలో రేవంత్ ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో తాజా బడ్జెట్‌తో స్పష్టమైంది. కేవలం అధికారం కోసమే హామీలు ఇచ్చినట్లు కేటాయింపులను చూస్తేనే అర్థమవుతున్నది. వృద్ధులు, వితంతులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు ఇస్తున్న సామాజిక పింఛన్లను పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. 18 ఏండ్లు పైబడిన అర్హులైన మహిళలందరికీ రూ.2,500 చొప్పున సాయం అందిస్తామని ప్రకటించింది. ఇక, నిరుద్యోగులను ఆదుకుంటామని, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డులు అందజేస్తామని చెప్పింది. తీరా బడ్జెట్‌లో చూస్తే ఏ ఒక్కదానిపైనా ప్రస్తావన లేదు. ఏ హామీకి ఒక్క రూపాయి కేటాయించలేదు. ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న ఉమ్మడి జిల్లాలోని లక్షలాది మహిళల ఆశలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. కాంగ్రెస్ వస్తే తమకు రెట్టింపు పింఛన్ వస్తదని భావించిన నాలుగు లక్షల మందికి పైగా లబ్ధిదారులకు మొండి'చేయి' చూపింది.

### సాగు, సంక్షేమానికి కత్తెర..

కేసీఆర్ హయాంలో వ్యవసాయానికి దండిగా మద్దతు ఉండేది. కానీ ప్రస్తుత ప్రభుత్వ బడ్జెట్‌ను చూస్తే రైతు సంక్షేమ పథకాలకు కోతలు పెట్టేందుకు యత్నించినట్లు తెలుస్తున్నది. రైతుబంధు స్థానంలో రైతుభరోసా తెస్తామని చెబుతున్న ప్రభుత్వం ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్‌లో నిర్దిష్టంగా పేర్కొనలేదు. పంటలకు బీమా విషయంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరనున్నట్లు ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు అందించే కార్యక్రమాన్ని ఈ ఏడాదిలోనే ప్రారంభిస్తామని వెల్లడించినప్పటికీ నిధుల కేటాయింపుపై స్పష్టతనివ్వలేదు.

### ఇందిరమ్మ ఇండ్లు..

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. సొంతంగా ఇండ్లు నిర్మించుకునే వారికి రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని, ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు అందిస్తామని ప్రకటించింది. ఎవరెవరు అర్హులో అన్న విషయాన్ని వెల్లడించకపోవడం గందరగోళానికి గురి చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 నియోజకవర్గాలు ఉండగా, 31,500 మందికి లబ్ధి కలుగనున్నది. ఈ పథకం కింద ఆర్‌సీసీ కప్పుతో వంట గది, టాయిలెట్ సౌకర్యం తప్పనిసరిగా కలిగి ఉండాలని నిర్దేశించింది. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అలాగే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించేందుకు ఏర్పాట్లు చేయనున్నది.



బడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించలేదని నిరసన వ్యక్తంచేస్తూ కామారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

### ఊసేలేని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల...

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ యూనివర్సిటీ మినహాయిస్తే ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఇంజినీరింగ్ కళాశాల ఒక్కటీ లేదు. కేసీఆర్ హయాంలో కోకొల్లలుగా జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరయ్యాయి. రేవంత్ ప్రభుత్వం వచ్చి రాగానే నిజామాబాద్ జిల్లాలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ ప్రకటన చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా టి.జీవన్‌రెడ్డి సైతం ఇంజినీరింగ్ కళాశాలను తీసుకొస్తానన్నారు. కానీ బడ్జెట్‌లో ఈ అంశాన్ని ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయింది. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేసిన సమయంలో పాలిటెక్నిక్ కాలేజీలో అనుబంధంగా ఇంజినీరింగ్ కాలేజీని స్థాపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. అందులో నిజామాబాద్ ప్రస్తావన వచ్చినా బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదు.

### 'నిజాం'గానే చిత్తశుద్ధి కరువు..

నిజాంషుగర్స్‌ను పునరుద్ధరిస్తామన్న హామీకి కట్టుబడి రేవంత్ ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ మేరకు ప్రస్తావన చేసింది. కానీ, ఆమేరకు నిధులు కేటాయించకుండా తమ వైఖరి ఏమిటో చెప్పకనే చెప్పింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. కాంగ్రెస్ గద్దెనెక్కి ఏడు నెలలు పూర్తయినా ఫ్యాక్టరీ పునరుద్ధరణపై అడుగు ముందుకు పడలేదు. ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘం పని చేస్తోందన్నారు తప్పితే తదుపరి చర్యలేమిటి.. ఎన్ని నిధులు కేటాయిస్తున్నారనేది వెల్లడించలేదు. తద్వారా పునరుద్ధరణపై తమ చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టం చేశారు.

# విస్తారంగా వర్షాలు

- నిండిన చెరువులు.. పొంగిన వాగులు
- ఉమ్మడి జిల్లాలో కూలిన ఇండ్లు



నవీపేట మండలం మద్దెపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు



డోంగ్లిలోని పంట పొలాల గుండా వెళ్తున్న వర్షపు నీరు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూలై 25: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపినివ్వని వానలతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. గడిచిన 24 గంటల్లో సగటున 24.6 మి.మీ.వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలతో గోదావరి, మంజీర నదులు నిండుగా ప్రవహిస్తున్నాయి. శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. బోధన్ పట్టణానికి నీరందించే బెల్లాల్ చెరువుతోపాటు పాండు చెరువు నిండిపోయాయి.నవీపేట మండలం మద్దెపల్లిలో పెంకుటిల్లు కూలిపోయింది. రుద్రూర్, కోటగిరిలో పలు చెరువులు నిండి మత్తడి దుంకుతున్నాయి. రుద్రూర్ మండలం రాణపల్లిలో 11, రుద్రూర్‌లో ఐదు, రాయకూర్‌లో ఒక ఇల్లు పాక్షికంగా కూలినట్లు అధికారులు తెలిపారు. బిచ్కుంద మండల కేంద్రంలో ఓ ఇల్లు కూలిపోయింది. పిల్లలు ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా కూలడంతో పెను ప్రమాదం తప్పింది. డోంగ్లి మండలంలో వాగులు పొంగిపొర్లుతున్నాయి. బీబీపేట మండలం జనగామ, మాందాపూర్ గ్రామాల్లో రెండిండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కామారెడ్డి పట్టణంలోని పలువార్డుల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలాయి. లింగంపేట మండలంలోని బోనాల్ తండా, శెట్పల్లిసంగారెడ్డి, గాంధీనగర్, పోల్కంపేట గ్రామాల్లో నివాసగృహాలు కూలిపోయినట్లు తహసీల్దార్ తెలిపారు.



రుద్రూర్ మండలం చిక్కడ్‌పల్లిలో అలుగుపై నుంచి పారుతున్న నీరు

# గ్రైండర్ కోసం మహిళల మధ్య గొడవ

- కత్తితో దాడి చేసిన వైనం
- ఒకరికి తీవ్రగాయాలు

నవీపేట, జూలై 25: గ్రైండర్ విక్రయం వివాదాకి దారి తీయగా ఓ మహిళ మరో మహిళపై కత్తితో దాడిచేసిన ఘటన నవీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్‌లో గురువారం చోటు చేసుకున్నది. స్థానికులు, ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గనిశెట్టి గంగవ్వ అదే గ్రామానికి చెందిన ఈర్నాల సావిత్రికి పదిరోజుల క్రితం గ్రైండర్‌ను రూ.రెండు వేలకు విక్రయించింది. ఆ గ్రైండర్ పనిచేయకపోవడంతో తిరిగి తీసుకోవాలని, తాను ఇచ్చిన రూ.రెండు వేలు ఇవ్వాలని గంగవ్వను కోరింది. గంగవ్వ డబ్బులు ఇవ్వకపోగా రిపేర్ చేయించి ఇస్తానని చెప్పి వారం రోజుల క్రితం ఇద్దరూ నిజామాబాద్ వెళ్లారు. రిపేర్ ఖర్చు రూ. 1100 అవుతుండడంతో ఆ డబ్బులు చెల్లించాలని సావిత్రి, గంగవ్వను కోరింది. ఈ విషయమై మాటామాట పెరిగి సావిత్రి చాకుతో గంగవ్వపై దాడి చేసింది. దీంతో అదేరోజు గంగవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా మరోసారి గంగవ్వ దగ్గరికి వెళ్లిన సావిత్రి.. గ్రైండర్ తిరిగి తీసుకోవాలని, తన డబ్బులు తనకివ్వాలని అడిగింది. గ్రైండర్ విక్రయించిన తర్వాత తిరిగి డబ్బులు ఇవ్వడం కుదరదని చెప్పడంతో మరింత కక్ష పెంచుకున్న సావిత్రి గురువారం ఉదయం గంగవ్వ ఇంటికి వెళ్లి కమ్మ కత్తితో తలపై దాడి చేసింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై యాదగిరి గౌడ్ క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. బాధితురాలి తమ్ముడు గనిశెట్టి రాజు ఫిర్యాదు మేరకు సావిత్రిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# డోంగ్లీలో విషాదం

- తల్లి, కూతురు ఆత్మహత్య
- అనారోగ్య కారణాలతోనేనని అనుమానం

డోంగ్లి, జూలై 25 : కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండల కేంద్రంలో గురువారం విషాదం చోటుచేసుకుంది. తల్లి, కూతురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మష్నాజీ, మాలన్‌బాయి (46) దంపతులకు కూతురు మనీషా (23), కుమారుడు మంగళ్‌దీప్ ఉన్నారు. కుమార్తెకు మతిస్థిమితం సరిగా లేదు. తాగుడు అలవాటు ఉన్న మష్నాజీ భార్యను తరచూ వేధించేవాడు. ఈ క్రమంలో విసుగుచెందిన ఆమె భర్తను హతమార్చాలనుకున్నది. గత మార్చి నెలలో తన మేనల్లుళ్లు ఇద్దరితో కలిసి మష్నాజీని హత్య చేసింది. ఈ కేసులో జైలుకు వెళ్లిన ఆమె ఇటీవలే బెయిల్‌పై బయటికివచ్చింది. మాలన్‌బాయి కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధ పడుతున్నది. పదో తరగతి చదువుతున్న కుమారుడు మంగల్‌దీప్ పాఠశాల నుంచి సాయంత్రం వచ్చేసరికి ఇంట్లో తల్లి, అక్క ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. బోరుమన్న అతడు స్థానికులను పిలువగా, వారు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న జుక్కల్ ఎస్సై సత్యనారాయణ సిబ్బందితో కలిసి వివరాలను సేకరించారు. అనారోగ్యం కారణంగానే తల్లి, కూతురు ఆత్మహత్య చేసుకున్నారని అనుమానిస్తున్నారు.

# మంజీరలో చిక్కుకున్న పశువుల కాపరులు

**గజ ఈతగాళ్ల సాయంతో కాపాడిన పోలీసులు**

బోధన్ రూరల్, జూలై 25: మంజీరా నదిలో ముగ్గురు పశువుల కాపరులు చిక్కుకున్న ఘటన సాలూర మండలం మందర్నలో గురువారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన శివరాజ్, చందు, ప్రకాశ్ మహరాజ్ మంజీరలో ప్రవాహం తక్కువగా ఉండడంతో పశువులను మేపడానికి నది దాటి వెళ్లారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మధ్యాహ్నం మంజీరలో వరద ఉధృతి పెరిగింది. దీంతో తిరిగి వస్తుండగా నీటి ప్రవాహం పెరగడంతో మధ్యలోనే చిక్కుకున్నారు. తోటి పశువుల కాపర్లు గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గజఈతగాళ్ల సాయంతో ముగ్గురిని క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. సకాలంలో స్పందించిన పోలీసులను గ్రామస్తులు సన్మానించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువుల కాపర్లు, రైతులు, ప్రజలెవ్వరూ నదీ తీర ప్రాంతాలకు వెళ్లొద్దని బోధన్ రూరల్ సీఐ నరేశ్ సూచించారు. ఆయన వెంట బోధన్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్, గ్రామస్తులు ఉన్నారు.





నదిలో నుంచి సురక్షితంగా బయటపడ్డ ముగ్గురు పశువుల కాపరులు, నదిలో చిక్కుకున్న పశువుల కాపర్లు (ఇన్‌సెట్‌లో..)